ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
గురువారం 18 ఏప్రిల్ 2024





ఇల్లందకుంటలో శ్రీసీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులు

స్వామివారి కల్యాణం తిలకిస్తున్న భక్తులు

స్వామివారికి నమస్కరిస్తున్న కలెక్టర్

# కమనీయం..రమణీయం..

- జిల్లా వ్యాప్తంగా వైభవంగా సీతారాముల కల్యాణం
- ఇల్లందకుంటలో రాష్ట్ర ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన కలెక్టర్
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

ఇల్లందకుంట, ఏప్రిల్ 17: ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని బుధవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠ చేశారు. ఉదయం 11గంటలకు ఎదుర్కోళ్ల కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున కలెక్టర్ పమేలా సత్పతి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు స్వామివారికి సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శేషం రామాచార్యులు, అర్చకులు వంశీధరాచార్యులు, యాజ్ఞికుడు శేషం సీతారామచార్యులు మధ్యాహ్నం 12:34 గంటలకు జీలకర్ర బెల్లం పెట్టారు. 12:46 గంటలకు సీతమ్మ మెడలో రామచంద్రమూర్తి మాంగళ్యధారణ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ కార్యనిర్వాహణాధికారి కందుల సుధాకర్, హుజూరాబాద్ ఆర్డీవో రమేష్ బాబు ఏర్పాట్లు చేశారు. సీపీ అభిషేక్ మొహంతి ఆదేశాల మేరకు హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ పర్యవేక్షణలో భారీ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీవో రమేష్‌బాబు, తహసీల్దార్ రాజీ, స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఎంపీపీ సరిగొమ్ముల పావని, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, కాంగ్రెస్ నాయకులు వెలిచాల రాజేందర్‌రావు, తుమ్మేటి సమ్మిరెడ్డి, దేశిని కోటి, పెద్ది కుమార్, గుడేపు సారంగపాణి, సాయిని రవి, పైడిపెల్లి అయోధ్య పాల్గొన్నారు.

**● భక్తులకు ఉచిత సేవలు..**

జమ్మికుంట మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. జమ్మికుంట నుంచి ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సౌజన్యంతో మజ్జిగ పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యుడు తులసీదాస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు.

**● కరీంనగర్‌లో..**

కరీంనగర్ కల్చరల్: శ్రీరామనవమి సందర్భంగా జిల్లా కేంద్రంలోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సప్తగిరికాలనీ కోదండ రామాలయంలో కార్పొరేటర్లు దిండిగాల మహేశ్, చాడగొండ బుచ్చిరెడ్డి, ఆలయ చైర్మన్ కె గౌతమరావు, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి, మధుర గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. వావిలాలపల్లి సీతారామాలయంలో కార్పొరేటర్ మేచినేని వనజ, ఆలయ అధ్యక్షుడు మేచినేని అశోక్‌రావు పాల్గొన్నారు. గాంధీరోడ్ రామాలయంలో ఆలయ చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. చైతన్యపురి మహాశక్తి ఆలయంలో ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కమాన్‌రోడ్ రామేశ్వరాలయంలో కార్పొరేటర్ కొలిపాక అంజయ్య, గణేశ్‌నగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. రాంనగర్ రమాసత్యనారాయణస్వామి, అభయాంజనేయస్వామి ఆలయంలో జరిగిన కల్యాణంలో మాజీ ఎంపీ బి వినోద్‌కుమార్ దంపతులు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి- హరిశంకర్ పట్టువస్త్రాలు సమర్పించారు. భగత్‌నగర్ జడ్పీ క్వార్టర్స్ వేంకటేశ్వరాలయంలో మేయర్ సునీల్‌రావు దంపతులుపాల్గొన్నారు. మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరాలయంలో ఈవో ఉడుతల వెంకన్న, వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్ పాల్గొన్నారు. మంకమ్మతోట వేంకటేశ్వరాలయంలో వ్యవస్థాపక ధర్మకర్త పిట్టల శ్రీనివాస్, ఈఓ నాగారపు శ్రీనివాస్ పాల్గొన్నారు. విద్యానగర్‌లోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అధ్యక్షుడు శ్రీరాం భద్రయ్య పాల్గొన్నారు. శ్రీరాంనగర్‌కాలనీలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో కాలనీవాసులు పాల్గొన్నారు. హెలీప్యాడ్‌గ్రౌండ్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో మేయర్ సునీల్‌రావు-అపర్ణ దంపతులు పాల్గొన్నారు. 41వ డివిజన్ భక్తాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో కార్పొరేటర్ బండారి వేణు ఆధ్వర్యంలో వావిలాల యూత్ బాధ్యులు సందీప్, హరీశ్, శేఖర్, సతీశ్ పాల్గొన్నారు. యజ్ఞవరాహ క్షేత్రంలో సర్వవైదికసంసస్థానంట్రస్టు మేనేజింగ్‌ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్ పాల్గొన్నారు.

### శ్రీరాముడి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

**- మంత్రి పొన్నం ప్రభాకర్**

శ్రీసీతారామచంద్రస్వామి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్-మంజుల దంపతులు, నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌తో పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణానికి వచ్చిన భక్తులకు మహాన్నదాన కార్యక్రమం చేపట్టిన మిల్లర్స్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. పొన్నం సత్తయ్య జ్ఞాపకార్థం ప్రతి ఏటా ఏర్పాటు చేసే చల్లని మజ్జిగ ట్యాంకర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లందకుంట ఆలయంలో జరిగే వేడుకలను రాష్ట్ర స్థాయి వేడుకలుగా గుర్తించే ప్రయత్నం చేస్తానన్నారు. ఆయన వెంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి, మాజీ సర్పంచ్ పెద్ది కుమార్, తుమ్మేటి సమ్మిరెడ్డి, కృష్ణారెడ్డి, పొనగంటి మల్లయ్య, స్వరూప, నాయకులు పైడిపెల్లి అయోధ్య, సారంగపాణి, సాయిని రవి, పూదరి శివ, సదయ్య, రవి, సలీం పాల్గొన్నారు.


కమాన్‌రోడ్ రామేశ్వరాలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి


మంత్రి పొన్నం దంపతుల ప్రత్యేక పూజలు


స్వామివారి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, తదితరులు

### ఘనంగా శేషవాహన సేవ

**● పాల్గొన్న ఎంపీ బండి సంజయ్‌కుమార్**

ఇల్లందకుంట: ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామివారి ఉత్సవమూర్తులను శేష వాహనంపై అధిరోహించి దేవాలయ ప్రాంగణంలో ఊరేగించారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శేషవాహన సేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మండల అధ్యక్షురెడ్డి సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


శేషవాహన సేవలో ఎంపీ బండి సంజయ్‌కుమార్


మహాశక్తి ఆలయంలో సీతారాముల కల్యాణ వేడుకలో పాల్గొన్న ఎంపి బండి సంజయ్‌కుమార్ దంపతులు


హెలీప్యాడ్ పార్క్ ఆవరణలో ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో పట్టు వస్త్రాలు, తలంబ్రాలను తీసుకవస్తున్న మేయర్ సునీల్‌రావు దంపతులు


రాంనగర్ రమాసత్యనారాయణ అభయాంజనేయస్వామి ఆలయంలో బీఆర్ఎస్ అభ్యర్థి బి వినోద్‌కుమార్, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి హరిశంకర్ దంపతులు

# నేటి నుంచి నామినేషన్లు

- 25వరకు స్వీకరణ... 26న పరిశీలన
- 29 వరకు ఉపసంహరణకు గడువు
- మే 13న పోలింగ్... జూన్ 4న ఓట్ల లెక్కింపు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయింది. ఎన్నికల ప్రక్రియలో తొలి ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ గురువారం నుంచి ప్రారంభం కానున్నది. దీని కోసం ప్రభుత్వ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఏప్రిల్ 18 నుంచి 25వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 26వ తేదీన నామినేషన్లను పరిశీలిస్తారు. 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. ఉపసంహరణ అనంతరం తుది జాబితాను అదే రోజు వెల్లడిస్తారు. మే 13న పోలింగ్ జరుగుతుంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది. కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో నామినేషన్ల స్వీకరణకు కలెక్టరేట్‌లో జిల్లా రిటర్నింగ్ అధికారి కార్యాలయాలన్నిఏర్పాటు చేశారు. ప్రతి రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను రిటర్నింగ్ అధికారి స్వీకరిస్తారు. పోటీచేసే అభ్యర్థులు జనరల్ కేటగిరీ అయితే 25,000, ఎస్సీ, ఎస్టీ కేటగిరీ అయితే 12,000 రూపాయల డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. రిటర్నింగ్ కార్యాలయం వద్ద 100 మీటర్ల దూరం వరకు మూడు వాహనాలు, అభ్యర్థి వెంట నలుగురికే అనుమతి ఇస్తారు. ఒక అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లను అందజేయవచ్చు. జాతీయ, ప్రాంతీయ పార్టీలకు చెందిన అభ్యర్థులను సంబంధిత నియోజకవర్గం నుంచి ఒక ఓటరు ప్రతిపాదిస్తే సరిపోతుంది. పోటీచేసే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే ముందు ఎన్నికల వ్యయాలను చూపించేందుకు కొత్తగా బ్యాంకు ఖాతాను తెరచి, ఆ ఖాతా నంబర్‌ను పొందుపరచాల్సి ఉంటుంది. అభ్యర్థులపై క్రిమినల్ కేసులు ఉంటే నామినేషన్ పత్రంలో తప్పనిసరిగా పొందుపరచాలి. నామినేషన్ దాఖలు చేసేందుకు అభ్యర్థి, ప్రతిపాదించిన వారే స్వయంగా పత్రాలు అందజేయాల్సి ఉండగా, అభ్యర్థులు రిటర్నింగ్ అధికారి సమక్షంలో ఈసీ నిర్దేశించిన మేరకు ప్రమాణం చేయాల్సి ఉంటుంది. నామినేషన్లలో ఖాళీలు పూర్తిచేసేందుకు ఆర్వో కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. ప్రచార సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందుగానే 'సువిధ' ద్వారా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది.



**పార్లమెంట్ నియోజకవర్గంలో 17,89,353 మంది ఓటర్లు**

కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో కరీంనగర్, హుజూరాబాద్, మానకొండూర్, చొప్పదండి, హుస్నాబాద్, సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో మొత్తం 17,89,353 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 8,74,884 మంది పురుషులు, 9,14,367 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 102 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు.

- కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 3,62,440 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,81,025 మంది పురుషులు, 1,81,372 మంది మహిళలు, 43 మంది థర్డ్‌జెండర్లు ఉన్నారు. - చొప్పదండి నియోజకవర్గంలో 1,13,599 మంది పురుషులు, 1,21,523 మంది మహిళలు, ఆరుగురు థర్డ్‌జెండర్లతో కలిపి 2,35,128 మంది ఓటర్లు ఉన్నారు.
- వేములవాడలో 1,07,768 పురుషులు, 1,17,506 మంది మహిళలు, 32 మంది థర్డ్ జెండర్లతో కలిపి మొత్తం 2,25,306 మంది ఓటర్లు ఉన్నారు.
- సిరిసిల్ల నియోజకవర్గంలో 1,19,124 మంది పురుషులు, 1,25,965 మంది మహిళలు, 8 మంది థర్డ్ జెండర్లు, మొత్తం 2,45,097 మంది ఓటర్లు ఉన్నారు.
- మానకొండూర్ నియోజకవర్గంలో 1,09,943 మంది పురుషులు, 1,14,902 మంది మహిళలు, ఒక థర్డ్ జెండర్‌తో కలిపి 2,24,846 మంది ఓటర్లు ఉన్నారు.
- హుజూరాబాద్‌లో 1,21,282 మంది పురుషులు, 1,27,963 మంది మహిళలు, ఏడుగురు థర్డ్‌జెండర్లతో కలిపి మొత్తం 2,49,252 మంది ఓటర్లు ఉన్నారు.
- హుస్నాబాద్ నియోజకవర్గంలో 1,21,069 మంది పురుషులు, 1,25,075 మంది మహిళలు, ఐదుగురు థర్డ్‌జెండర్లతో కలిపి 2,46,149 మంది ఓటర్లు ఉన్నారు.
- 174 మంది ఓవరసీస్ ఓటర్లు, 961 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు.

### నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి

**● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి**

కరీంనగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్ సభ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధి కారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను కచ్చితంగా పాటి స్తూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని కోరారు. గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలవుతున్న నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ అంశాలను జిల్లా ఎన్నికల అధికారి పమేలాసత్పతి మీడియాకు వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఈనెల 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ, 26న పరిశీలన ఉంటుందని చెప్పారు. 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి ఛాంబర్‌లో నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తా మన్నారు. నామినేషన్ వేయడానికి ముందే పోటీచేసే అభ్యర్థి పేరు మీద ఏదైనా జాతీయ బ్యాంకులో ఎన్నికల ఖర్చుల కోసం కొత్తగా ఖాతా తెరిచి, ఆ ఖాతా నంబర్‌ను దరఖాస్తులో పొందుపరచాలని సూచించారు. కరపత్రాల ముద్రణ విషయంలో 127-ఏ నిబంధ నలను తప్పనిసరిగా పాటించాలన్నారు. లోక్‌సభకు పోటీచేసే అభ్య ర్థులు 95 లక్షలకు మించి ఖర్చు చేయవద్దని కలెక్టర్ తెలిపారు.

## వెలసిన శ్రీరాముని విగ్రహం

రాయికల్, ఏప్రిల్ 17: మండలంలోని అల్లీపూర్, సింగరావుపేట గ్రామాల మధ్య ఉన్న రాములోరి బిలుకుపై శ్రీరాముని విగ్రహం బుధవారం వెలిసింది. ఈ సందర్భంగా విగ్రహానికి గ్రామస్థులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అల్లీపూర్ మాజీ సర్పంచ్ బాలె శోభారాణి, మాజీ ఎంపీటీసీ బాలె చంద్రశేఖర్, మాల్యావు మురళి, బర్ల లవణ్, వేముల సతీష్, వేణురావు తదితరులు పాల్గొన్నారు.

● రాయికల్ మండలంలోని అయోధ్య సీతారామునికి సింగరావుపేట గ్రామానికి చెందిన నాగేంద్రచారి అనే కళాకారుడు స్వర్ణ సూర్య తిలకాన్ని తయారు చేసి స్వామివారికి అలంకరించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్యలో సూర్య కిరణాలతో సీతారామునికి తిలకాన్ని అందించగా ఇక్కడ స్వర్ణ తిలకాన్ని అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాగేంద్రచారిని పలువురు అభినందించారు.

## పిచ్చి కుక్కల స్వైర విహారం

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 17: రామగుండం కార్పొరేషన్‌లో పిచ్చి కుక్కల స్వైర విహారం రోజురోజుకు పెరుగుతోంది. బుధవారం 26వ డివిజన్ మార్కండేయకాలనీలో ఓ పిచ్చి కుక్క ఎనమిది మందిపై దాడి చేసింది. ఇందులో నలుగురు చిన్నారులు ఉన్నారు. ఈ పది రోజుల్లో ఆయా కాలనీల్లో 20మంది పిచ్చి కుక్కల బారిన పడ్డారు. మార్కండేయకాలనీలో బుధవారం రోడ్డుపై నడిచివెళుతున్న వారిపై కుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన 8మంది గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందారు. రామగుండం కార్పొరేషన్‌లో ఒకవైపు కుక్కల బెడద మరోవైపు కోతుల స్వైరవిహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

## కిరాణంలో మద్యం నిల్వలు : కేసు నమోదు

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 17: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్‌లో బుధవారం పోలీసులు ఓ కిరాణం దుకాణంలో మద్యం నిల్వలను గుర్తించారు. గ్రామానికి చెందిన గోపి అనే వ్యక్తి కిరాణం నిర్వహిస్తూ అందులోనే మద్యం విక్రయిస్తున్నాడని గుర్తించారు. కిరాణంలో నిల్వ ఉన్న సుమారు 6,500 రూపాయల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## జగిత్యాలలో జోరుగా వ్యభిచారం

### - బాలికలతో వ్యాపారం కొనసాగిస్తున్నారని గుర్తించిన పోలీసులు
### - నోటీసులు జారీ చేసిన తహసీల్దార్

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 17: జగిత్యాల జిల్లా కేంద్రంలోని జగిత్యాల-నిజామాబాద్ రహదారిలో ఉన్న ఓ ప్రాంతంలో కొన్ని రోజులుగా జోరుగా వ్యభిచారం నిర్వహిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రధాన రహదారి పక్కన ఉన్న ఇంటిలో కొంత మంది ఇతర ప్రాంతాల నుంచి మహిళలు, బాలికలను ఇక్కడకు తీసుకువస్తూ వ్యభిచార రొంపిలోకి దించుతూ సొమ్ముచేసుకుంటున్నారు. అయితే జోరుగా వ్యభిచారం జరుగుతుందనే అనే సమాచారంతో పట్టణ పోలీసులు ఈ ప్రాంతంలో దాడులు నిర్వహించగా ఓ బాలిక వ్యభిచారం చేస్తూ పట్టుబడినట్లు తెలిసింది. దీంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. గాంధీనగర్ ప్రాంతంలో ఓ మహిళ వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. బాలికతో పాటు మహిళలతో వ్యభిచారం చేయిస్తూ సొమ్ము చేసుకోవడంతో పాటు ప్రజారోగ్యానికి హానికరంతో పాటు అనైతిక చర్యగా పాల్పడుతున్నట్లు భావించారు. దీంతో రెవెన్యూ అధికారులు సెక్షన్ 133 సీఆర్‌పీసీ కింద నిర్వాహకురాలికి నోటీసులు జారీ చేశారు. బుధవారం జగిత్యాల డీఎస్పీ రఘుచందర్‌తో పాటు సీఐ వేణుగోపాల్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది సంబంధిత ఇంటిని గుర్తించి నోటీసును అతికించారు. మూడు రోజుల్లో దీనిపై సమాధానం ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.

# చెరువులో మునిగి యువకుడి మృతి


రోదిస్తున్న కుటుంబీకులు(ఇన్‌సెట్‌లో సాయి(ఫైల్))

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 17: మూగ జీవాన్ని కాపాడబోయిన యువకుడు ఈత రాకపోవడంతో చెరువులో మునిగి ప్రాణాలను ఒదిలాడు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన మిర్యాల్‌కార్ సాయికుమార్ (23) తండ్రి మాంసం విక్రయిస్తాడు. ఈ క్రమంలో తమకున్న మేకలు, గొర్రెలను మేత కోసం తండ్రి కిషన్‌తో కలిసి సాయికుమార్ గ్రామ శివారులోని గిద్దె చెరువు ప్రాంతానికి వెళ్లారు. ఓ మేక చెరువులోకి వెళ్లడంతో గమనించిన సాయికుమార్ కాపాడేందుకు చెరువులోకి దిగాడు. లోనికి దిగుతున్న తరుణంలో పెద్ద గోతిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి మృతి చెందాడు. సమీపంలో ఉన్న తండ్రి గమనించి తన కొడుకు చెరువులో మునిగిపోయాడని, రక్షించాలంటూ కేకలు వేశాడు. చుట్టు పక్కల వారితోపాటు అక్కడకు చేరుకున్న యువకులు కొత్త రాజు, కుంచం రవి, గౌరీశంకర్, శ్రీనివాస్ చెరువులోకి దిగి గాలించారు. ఈ క్రమంలో శ్రీనివాస్ నీట మునుగుతుండగా గౌరీశంకర్ గమనించాడు. వెంటనే అప్ర మత్తమై అతడిని కాపాడి ఒడ్డుకు చేర్చాడు. మరో ప్రాణం పోకుండా రక్షించాడు. అనంతరం సుమారు 30 నిమిషాల పాటు సాయికుమార్ మృతదేహం కోసం గాలించారు. చివరకు సాయికుమార్ మృతదేహాన్ని వెలికి తీశారు. యువకులను స్థానికులు అభినందించారు. మృతుడి తండ్రి కిషన్ ఫిర్యాదుతో కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమాకాంత్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆరె కటిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు మిర్యాల్‌కార్ శ్రీనివాస్, సభ్యులు కోరారు.

## అంజన్న సేవలో న్యాయమూర్తులు


కొండగట్టు అంజన్న సన్నిధిలో న్యాయమూర్తులు

మల్యాల, ఏప్రిల్ 17: కొండగట్టు ఆంజనేయస్వామిని బుధవారం వేములవాడ, సిరిసిల్లా, కరీంనగర్, మంచిర్యాల కోర్టుల న్యాయమూర్తులు జ్యోతి, ప్రవీణ్ కుమార్, హేమలత, స్వాతి దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన న్యాయమూర్తులు స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

## ఇంట్లో చోరీకి పాల్పడ్డ నిందితుల రిమాండ్

కథలాపూర్, ఏప్రిల్ 17 : మండలంలోని తక్కళ్ళపల్లిలో నక్క సతీష్ ఇంట్లో చోరీకి పాల్పడ్డ నలుగురు నిందితులను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్టు ఎస్సై నవీన్ తెలిపారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో బోధన్‌కు చెందిన ఒడిబిడి పోషెట్టి అతని భార్య లక్ష్మీ, బింగి గంగమణి, జావెద్ ఖాన్ చొరబడి మూడువేల నగదు ఎత్తుకెళ్లారని వారిని పట్టుకుని రికవరీ చేసినట్టు చెప్పారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని చెప్పారు. వీరు జగ్గాసాగర్, వేల్పూరు గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడినట్టు అంగీకరించారని అరెస్ట్ చేసి కోరుట్ల మున్సిఫ్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచామని ఎస్సై తెలిపారు.

## గుడుంబా ప్యాకెట్లు పట్టివేత

వీణవంక, ఏప్రిల్ 17: మండల కేంద్రంలోని బస్టాండు ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించిన ఇల్లంతకుంట మండలం మాల్యాల గ్రామానికి చెందిన తిరుపతిసురేష్, శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామనికి చెందిన అంగిడి సమ్మయ్యను తనిఖీలు చేయగా గుడుంబా ప్యాకెట్స్ పట్టుబడ్డాయని ఎస్సై తిరుపతి తెలిపారు. సుమారు ఐదున్నర లీటర్ల గుడుంబా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ 1,650 రూపాయలు ఉంటుందని తెలిపారు. ఇద్దరిపై పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

**శంకరపట్నం:** శంకరపట్నం మండలంలోని కల్వల గ్రామ శివారులో బుధవారం గుడుంబా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు. ఆమెట్‌పల్లి గ్రామానికి చెందిన అంగిడి సమ్మయ్య అనే వ్యక్తి కల్వల గ్రామ శివారులో గుడుంబా తయారు చేస్తున్నాడని వచ్చిన సమాచారం మేరకు దాడులు చేశామని చెప్పారు. ఈ మేరకు గుడుంబా సామగ్రిని ధ్వంసం చేసినట్లు తెలిపారు. సమ్మయ్య నుంచి 40 గుడుంబా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

సైదాపూర్, ఏప్రిల్ 17: మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఎలబోతారం గ్రామంలోని గొడిశాల క్రాసింగ్ వద్ద ఎస్సై జన్ను ఆరోగ్యం ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. ఆ సమయంలో వీణవంక మండలం జంగపల్లి గ్రామానికి చెందిన మూ డు ట్రాక్టర్లు మానేరు వాగునుంచి అక్రమంగా తీసుకొని వెళ్తుండడంతో పట్టుకున్నామని ఎస్సై చెప్పారు. ఆ ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేశామని తెలిపారు.

## అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

గన్నేరువరం, ఏప్రిల్ 17: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై గన్నేరువరం పోలీసులు కేసు నమోదు చేశారు. బెజ్జంకి మండలం వడ్లూరు గ్రామానికి చెందిన పల్లె సంతోష్ అనే బెల్ట్‌షాప్ నిర్వహకుడు బుధవారం గన్నేరువరం నుంచి రూ.21,712 విలువ గల మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా మైలారం ఎక్స్ రోడ్ వద్ద ఎస్సై తాండ్ర నరేష్ పట్టుకున్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మద్యాన్ని తరలించినా, బెల్‌షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మానకొండూర్, ఏప్రిల్ 17: మండలంలోని ఈదులగట్టెపల్లి బస్టాండ్ సమీపంలో గల కాకతీయ కాల్వ వద్ద బుదవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారి ప్రక్కన గల కాకతీయ కాల్వ వద్ద అనుమానాస్పద స్థితిలో సుమారు 40 సంవత్సరాల లోపు గల గుర్తు తెలియని వ్యక్తిగా స్థానికులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు.

## వడదెబ్బతో యువకుడి మృతి


రవికుమార్(ఫైల్)

జ్యోతినగర్, ఏప్రిల్ 17: పెద్దపల్లి జిల్లా రామగుండం కార్పొరేషన్ పరిధిలోని జంగాలపల్లికి చెందిన మేకల రవికుమార్(32) అనే యువకుడు వడదెబ్బకు గురై బుధవారం మృతిచెందాడు. మంగళవారం తన పశువులను మేపేందుకు వెళ్లిన రవికుమార్ వడదెబ్బకు గురయ్యాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడికి ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రవికుమార్ మృతి చెందినట్లు ఎన్టీపీసీ పోలీసులు తెలిపారు. పాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న రవికుమార్ అవివాహితుడు. మృతుడి తండ్రి మేకల లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ ఏఎస్‌ఐ రయీస్ అహ్మద్ తెలిపారు.

## విద్యుదాఘాతంతో గడ్డివాము దగ్ధం

ఓదెల, ఏప్రిల్ 17 : మండలంలోని కొలనూర్‌లో బుధవారం కర్రే లక్ష్మారెడ్డి అనే రైతుకు చెందిన గడ్డివాము విద్యుత్ ఘాతంతో దగ్ధమైంది. గ్రామస్తులు పెద్దపల్లిలోని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో తరలివచ్చి మంటలను ఆపివేశారు. ఈ సంఘటన వల్ల దాదాపు రూ.40వేల మేరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు.

## జమ్మికుంటలో కారు..


జమ్మికుంటలో కాలిపోయిన కారు

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 17: జమ్మికుంట పట్టణంలోని కోరపల్లి రోడ్డులో నివాసం ఉంటున్న ఓంసాయి అనే మతి స్థిమితం లేని యువకుడు బుధవారం మధ్యాహ్నం ఇంటి వద్ద ఉన్న తన తండ్రి కారును దగ్ధం చేశాడు. కారులో నుంచి మంటలు రావడాన్ని కుటుంబ సభ్యులు గమనించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పివేశారు. యువకుడి తల్లి మాట్లాడుతూ ఐదేళ్లుగా తన కుమారుడి ఆరోగ్యం బాగలేదని, ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నామని తెలిపారు. అప్పటి నుంచి మతి స్థిమితం లేకుండా ప్రవర్తిస్తున్నాడని, కారు ఎందుకు తగులబెట్టావని అడిగితే చెప్పడం లేదని తెలిపారు.

# మియాపూర్‌లో అగ్నిప్రమాదం


అగ్నిప్రమాదంలో దగ్ధమైన ఇల్లు

సుల్తానాబాద్, ఏప్రిల్ 17: మండలంలోని మియాపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఓ ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఎర్రంశెట్టి లచ్చయ్య, శశిరేఖ దంపతులు కూలీపని చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. బుధవారం ఉదయం శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని ఇంట్లో దీపం వెలిగించి పూజలు చేసుకుని ర్యాకల్‌దేవ్‌పల్లి జాతరకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడం, ఇంటినుంచి పొగ రావడాన్ని చుట్టుపక్కల వారు గమనించారు. మంటలు ఎక్కువై ఇంట్లో ఉన్న వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. చుట్టుపక్కల వారు అప్రమత్తమై మంటలను ఆర్పివేశారు. ప్రమాదం గురించి బాధితులకు సమాచారం అందించగా వారు వచ్చి బోరున విలపించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ కొయ్యడ స్వప్నఅరుణ్ కోరారు.

### కార్మికులు ఆత్మహత్య చేసుకున్నా
# ప్రభుత్వంలో చలనం లేదు


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 17: సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో ఉపాధి లేక ఇద్దరు కార్మికులు ఆత్మహత్య చేసుకున్నా రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేక పోవడం దురదృష్టకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు సంబంధించిన పెండింగ్ బిల్లులు, నూతన ఆర్డర్లు ఇవ్వకుంటే రాబోయే ఎన్నికల్లో ప్రజల నిరసనను ప్రభుత్వం ఎదుర్కోక తప్పదన్నారు. వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలని ఆసాములు, కార్మికులు, యజమానులు, ప్రజా సంఘాలు జేఏసీగా ఏర్పడి ఆందోళనలు చేపట్టినట్లు చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ జేఏసీ నాయకులతో చర్చలు జరిపి త్వరగా బతకమ్మ చీరల బకాయిలు చెల్లిస్తామన్నారన్నారు. ప్రభుత్వ ఆర్డర్లు ఇస్తామని స్పష్టమైన హామీనిచ్చి పది రోజులు గడుస్తున్నా అమలు కాకపోవడం దురదృష్టకరమన్నారు. వస్త్ర పరిశ్రమపై ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ దాదాపు 30 వేల మంది కార్మిక కుటుంబాలు ఆధారపడి ఉన్నాయన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఇచ్చిన హామీలను 48 గంటల్లో నిలబెట్టుకోవాలని కోరారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, నాయకులు చంద్రమౌళి, సోమ నాగరాజు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో గల్ఫ్ కార్మికుడి బలవన్మరణం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 17: మండలంలోని సంగెం గ్రామానికి చెందిన శనిగారపు మహేష్ (30) అనే గల్ఫ్ కార్మికుడు అప్పుల బాధతో మంగళవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేష్ ఉపాధి నిమిత్తం మూడు సంవత్సరాల క్రితం గల్ఫ్ దేశమైన దు బాయ్ వెళ్లగా అక్కడ సరైన పని దొరకపోవడంతో కొన్ని రోజుల క్రితం స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. గల్ఫ్‌కు వెళ్లే సమయంలో మహేష్ బంధువుల వద్ద సుమారు నాలుగు లక్షల రూపాయల వరకు అప్పు చేశాడు. అప్పు ఇచ్చిన బంధువులు మహేష్‌ను డబ్బుల విషయంలో ఒత్తిడి చేయడంతో మనస్తాపంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. మహేష్ భార్య నాలుగు నెలల గర్భవతి అని గ్రామస్థులు తెలిపారు.

## పెళ్లి చేసుకొమ్మన్నందుకు యువకుడి ఆత్మహత్య


యోగేశ్(ఫైల్)

కథలాపూర్, ఏప్రిల్ 17: వయసు మీరిపోతోంది పెళ్లి చేసుకుని ఓ ఇంటి వాడివి కావాలని కుటుంబ సభ్యులు కోరగా మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నవీన్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని భూషణరావుపేటకు చెందిన రాసమల్ల యోగేశ్ (28) అనే యువకుడు హెయిర్ సెలూన్ నడుపుకుంటూ ఉపాధి పొందుతున్నాడు. అయితే ఇంట్లో వారు పెళ్లి చేసుకోమని కోరుతుండగా తాను ఇప్పుడే పెళ్లి చేసుకోనంటూ చెబుతూ వచ్చాడు. వారం రోజుల కిందట మనస్తాపం చెందిన యోగేశ్ పురుగుల మందు తాగడం తో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో ఎల్లారెడ్డిపేటలోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

# ఇన్సూరెన్స్ లేని స్కూల్ వ్యాన్

- విద్యార్థుల జీవితాలతో చెలగాటం
- బాధిత కుటుంబసభ్యుల ఆందోళన



ప్రమాదానికి కారణమైన స్కూల్ వ్యాన్

మల్యాల, ఏప్రిల్ 17: విద్యార్థులను తరలించే స్కూల్ వ్యాన్‌ను ఇన్సూరెన్స్ లేకుండా నడుపుతున్న ప్రైవేట్ స్కూల్ యాజమాన్య నిర్లక్ష్యానికి ఓ చిన్నారి బలి అయింది. మండలంలోని మద్దుట్లలో రామన్నపేటకు చెందిన శ్రీసరస్వతీ విద్యానికేతన్ స్కూల్ వ్యాన్ ముందు టైర్లు ఎక్కడంతో చిన్నారి అరీబా(18నెలలు) మృతి చెందడం గ్రామంలో విషాదం నింపింది. కాగా బుధవారం మృతి చెందిన చిన్నారి కుటుంబసభ్యులు పాఠశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్కూల్ ముందు చిన్నారి మృతదేహంతో ఆందోళనకు సిద్ధం అయ్యారు. స్కూల్ వ్యాన్‌కు ఇన్‌స్రెన్స్ లేకపోవడంతో మండిపడ్డారు. మద్దుట్లకు చెందిన నాయకులు కూడా స్కూల్ యాజమాన్యంపై అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాఠశాల నిర్వహకులు, ప్రైవేట్ స్కూల్స్ సంఘ నాయకులు చిన్నారి ఇంటికి వచ్చి మాట్లాడారు. స్కూల్ వ్యాన్‌కు ఇన్‌స్రెన్స్ ఉంటే తమకు మేలు జరిగేదని లేకపోవడంతో నష్టపోవాల్సి వస్తుందని ఈ సందర్భంగా చిన్నారి బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇన్‌స్రెన్స్ లేకపోవడంతో పరిహారంగా రెండు విడతల్లో రూ.5.5లక్షల చెల్లింపునకు పాఠశాల యాజమాన్యం ఒప్పుకున్నారని, దీంతో చిన్నారి కుటుంబసభ్యులు ఆందోళన విరమించినటు తెలిపారు. కాగా స్కూల్ వ్యాన్ ఇన్సూరెన్స్ వివరాలు తెలుసుకునేందుకు నిర్వహకులు సత్యానారాయణరావును సెల్‌ఫోన్‌లో సంప్రదించగా లిఫ్ట్ చేయలేదు.

**● వాహనాల పత్రాలపై నిర్లక్ష్యం..**

స్కూల్ విద్యార్థులను తరలించే వాహనాల ఇన్‌స్రెన్స్, ఫిట్‌నెస్, ట్యాక్స్ తదితర అన్ని రకాల పత్రాలు రవాణాశాఖ అధికారులు తరచూ తనిఖీలు చేయాల్సి ఉంటుండగా.. మద్దుట్లలో ప్రమాదానికి కారణమైన స్కూల్‌వ్యాన్‌కు ఇన్సూరెన్స్ లేకపోవడాన్ని అధికారుల తనిఖీల లోపంగా మద్దుట్ల వాసులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్కూల్ విద్యార్థులను తరలించే వాహనాలను పకడ్బందీగా తనిఖీలు చేసి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యాశాఖ అధికారులు కూడా స్పందించాలని కోరుతున్నారు.



# పులకించిన భద్రగిరి

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

● కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



స్వామివారి ఊరేగింపు



ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు



# నామినేషన్ల ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 17: లోక్‌సభ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను గురువారం నుంచి పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్సులో లోక్‌సభ నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం నేపథ్యంలో చేపట్టాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ నుంచి పరిశీలన, ఉపసంహరణ వరకు రిటర్నింగ్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలు జరుగకుండా ప్రత్యేక దృష్టిసారించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో నిబంధనలు పాటించేలా చూడాలని సూచించారు. పోలింగ్ జరిగే వరకు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. స్టాటిస్టిక్ సర్వేలైన్స్ టీమ్‌లు ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. సువిధ కింద ప్రచార సభలు, సమావేశాలకు సంబంధించి అనుమతులను వెంట వెంటనే ఇవ్వాలని తెలిపారు. సి విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును ఉద్యోగులందరూ వినియోగించుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. సోషల్ మీడియాలో ప్రచారానికి సంబంధించి వచ్చే పోస్టులపై దృష్టిపెట్టాలని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ ముద్రణ సమయంలో సింబల్ అలాట్‌మెంట్ జాగ్రత్తగా జరిగేలా చూడాలని, ఎలాంటి తప్పిదాలు జరుగకుండా చూడాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి, జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, సిరిసిల్ల అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్‌వో పవన్‌కుమార్, కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవోలు మహేశ్వర్, రమేశ్‌బాబు ఇతర అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

## సివిల్స్ సాధించిన యువకుడికి సన్మానం





సాయికిరణ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సత్యం, మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 17: సివిల్ సర్వీసెస్ ర్యాంకు సాధించిన రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన నందాల సాయికిరణ్‌ను కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్‌చైర్మన్ మాట్లాడుతూ పద్మశాలి ముద్దు బిడ్డ 27వ సివిల్స్ ర్యాంకు సాధించడం హర్షణీయమన్నారు.

● రామడుగు: యూపీఎస్సీ ఫలితాలలో జాతీయ స్థాయిలో 27వ ర్యాంకు సాధించిన మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన సాయికిరణ్‌ను స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బుధవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత సాయికిరణ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రామడుగు ఎంపీపీ జవాజి హరీష్, మండల అధ్యక్షులు బొమ్మెరవేణి తిరుపతి, వీర్ల నర్సింగరావు ఉన్నారు.

● సివిల్స్‌లో సత్తాచాటిన రామడుగు మండలంలోని వెలిచాల గ్రామానికి చెందిన సాయికిరణ్‌ను స్థానిక మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న బుధవారం వేర్వేరుగా శాలువాతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులందరూ సాయికిరణ్‌ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు కోరారు. వెంకట్‌రామిరెడ్డి, నాయకులు ఉన్నారు.

## 'కాంగ్రెస్‌పార్టీని బలహీనపరిచే వారిపై క్రమశిక్షణ చర్యలు'

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 17: కాంగ్రెస్ పార్టీని బలహీనపరిచే విధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తప్పవని డీసీసీ ఉపాధ్యక్షులు మల్యాల సుజిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్ష కార్యక్ర మానికి ఆలస్యంగా వచ్చిన నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి వేదికపై స్థలం లేకపోవటం, రద్దీ కారణంగా ముందు కూర్చున్నారని తెలిపారు. కొంతమంది పార్టీలో అంతర్గత విభేదాలు సృష్టించి, కాంగ్రెస్ పార్టీని ప్రజల్లో పలుచన చేసే విధంగా ఈ అంశాన్ని సోషల్ మీడియా గ్రూపుల్లో వైరల్ చేశారన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేష్‌నగర్, ఏప్రిల్ 17: కరీంనగర్ రూరల్ మండలంలోని దుర్గామాత, వల్లంపహాడ్ 11కెవి ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రూరల్ ఏడీఈ కొల్పుల రాజు ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గామాత 11కెవి ఫీడర్ పరిధిలోని తీగలగుట్టపల్లి, చంద్రపురి కాలనీ, ఆర్టీసీ కాలనీ, ఒడ్డెర కాలనీ, రెవెన్యూ కాలనీ, వల్లంపహాడ్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సహకరించాలని కోరారు.

## చికిత్స పొందుతూ ఆటో డ్రైవరు మృతి

చొప్పదండి, ఏప్రిల్ 17: మండల కేంద్రానికి చెందిన గోపాల అనిల్(34) అనే ఆటో డ్రైవర్ ఈ నెల 14న పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం అర్థరాత్రి మృతి చెందాడు. ఎస్సై ఉపేంద్రాచారి కథనం మేరకు.. చొప్పదండి మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన గోపాల అనిల్ ఏడాది క్రితం అప్పు చేసి ఇల్లు కట్టుకున్నాడు. దీంతో ప్రైవేటు ఫైనాన్స్‌లో అప్పుతీసుకొని సెకండ్ హ్యాండ్ ఆటో కొనుగోలు చేశాడు. ఫైనాన్స్ కిస్తు చెల్లించక పోవడంతో సిబ్బంది ఆటోను తీసుకెళ్లారు. మనస్తాపం చెంది పురుగుల మందు తాగాడని ఎస్సై తెలిపారు.

## ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ మోసం

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్

చొప్పదండి, ఏప్రిల్ 17: ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసగించిందని బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం చొప్పదండిలో ఆయన మార్నింగ్ వాక్ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యానికి క్వింటాలుకు ఐదు వందల బోనస్, రెండు లక్షల రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. తాను ఎంపీగా ఉన్న ఐదేళ్లలో జాతీయ రహదారులు, రైల్వేలైన్ తెచ్చానని, ఐదేళ్లలో బండి సంజయ్ నయాపైసా నిధులు తేలేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, మాజీ జడ్పీటీసీ ఇప్పనపల్లి సాంబయ్య, మాజీ ఎంపీపీ వల్లాల కృష్ణహరి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్, గడ్డం చుక్కారెడ్డి పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సన్మానం

జమ్మికుంట, ఏప్రిల్ 17: పొన్నం ప్రభాకర్ మంత్రి అయిన తర్వాత మొట్ట మొదటి సారి జమ్మికుంటకు వచ్చిన సందర్భంగా మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి ఆయనతో పాటు హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌ను గజమాలతో సత్కరించారు. మంత్రి ఇచ్చిన పిలుపు మేరకు నేతన్నలు నేసిన కాటన్ శాలువలు తెప్పించి సన్మానించారు. దీంతో మంత్రి అభినందించారు.

## 'అధికారులు చర్యలు తీసుకోవాలి'

జమ్మికుంట, ఏప్రిల్ 17: పట్టణంలోని ఓ ప్రైవేట్ విద్యా సంస్థ యాజమాని పదో తరగతి ఫలితాలు వెలువడక ముందే బహిరంగంగా హోర్డింగ్‌లు పెట్టి విద్యార్థుల తల్లిదండ్రులను అయోమయానికి గురి చేస్తున్నాడని, అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జోన్ కమిటీ సభ్యుడు చెలుపూరి రాములు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. అధికారులు చర్యలు తీసుకోకుంటే పార్టీ ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు.

## నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

హుజూరాబాద్, ఏప్రిల్ 17: హుజూరాబాద్ పట్టణంలోని వెంకటసాయి గార్డెన్‌లో నియోజకవర్గ విస్తృత స్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు వొడితెల ప్రణవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఆది శ్రీనివాస్‌తో పాటు కేకే మహేందర్‌రెడ్డి, పురిమల్ల శ్రీనివాస్, వెలిచాల రాజేందర్‌రావులు హాజరవుతారని ఆయన తెలిపారు.

## 'నిధులను సద్వినియోగం చేసుకోని ఎంపీ'

తిమ్మాపూర్, ఏప్రిల్ 17: కరీంనగర్ ఎంపీగా గెలుపొందిన బండి సంజయ్ తనకు ఇచ్చిన నిధులను కూడా సద్వినియోగం చేసుకోలేదని డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు. మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల క్యాంప్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెలిచాల రాజేందర్‌రావుతో కలిసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంపీగా బండి సంజయ్ ఐదేళ్లలో కేవలం పార్లమెంట్‌లో 57ప్రశ్నలు మాత్రమే అడగారని చెప్పారు. ప్రశ్నలు అడిగే ఓపిక, ప్రణాళికలు బండి సంజయ్‌కు లేదని పరిజ్ఞానం లేని వ్యక్తిని తిరిగి రెండో సారి పార్లమెంటుకు పంపిస్తే ఏంచేస్తారని ప్రశ్నించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణరెడ్డి, నాయకులు మామిడి అనిల్, పోలురామ్, పోలు రమేష్, కొత్త తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

**కరీంనగర్ టౌన్** : కాంగ్రెస్ నాయకుడు వెలిచాల రాజేందర్‌రావును ఎస్‌వీజేసీ కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. బుధవారం రాజేందర్‌రావు వారి పూర్వ కళాశాల ఎస్‌వీజేసీని సందర్శించగా యాజమాన్యం ఊట్కూరి మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ కాంతాల రాంరెడ్డి, మేడి వెంకటవరప్రసాద్ ఉన్నారు.

## ఆటో కార్మికుడి కుటుంబానికి పరామర్శ

చొప్పదండి, ఏప్రిల్ 17: మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ గోపాల అనిల్ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందగా బుధవారం కరీంనగర్ ఆటో యూనియన్ కార్మిక సంక్షేమ సంఘంఅధ్యక్షుడు మద్దెల రాజేందర్, ప్రధాన కార్యదర్శి బండారి సంపత్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రామ్‌గోపాల్‌రెడ్డి, కొడుముంజ తిరుపతి పాల్గొన్నారు.

## ధర్మసమాజ్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థిగా శ్రీకాంత్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 17: ధర్మసమాజ్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థిగా హుజురాబాద్ నియోజకవర్గంలోని కమలాపూర్ మండలం వంగపల్లి గ్రామానికి చెందిన చిలువేలు శ్రీకాంత్ పేరును ప్రకటించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ ఒక ప్రకటలో తెలిపారు.

## లాటరీ పేరుతో మోసం : కేసు నమోదు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 17: లాటరీ పేరుతో మోసానికి పాల్పడిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన సఫియోద్దీన్, కరీంనగర్ కశ్మీర్‌గడ్డకు చెందిన ఫారూఖ్‌లు కలిసి ఎస్‌కె ఫ్రెండ్స్ పేరిట సంస్థను ఏర్పాటు చేసి కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలకు చెందిన బాధితులకు లాటరీ ద్వారా బహుమతులు అందిస్తామని నమ్మబలికి నెలకు వెయ్యి రూపాయల వంతున వసూలు చేశారు. 15 నెలల తరువాత లాటరీ ద్వారా ఎంపికైన వారికి బహుమతులు అందిస్తామన్నారు. 2 ఏళ్లు గడిచినా బహుమతులు ఇవ్వకుండా మోసం చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సఫియోద్దీన్, ఫారూఖ్‌లపై కేసు నమోదు చేశారు.

# వైభవంగా సీతారాముల కల్యాణం

● ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే సందడి

● పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

హుజూరాబాద్, ఏప్రిల్ 17: సీతారాముల కల్యాణం డివిజన్‌లో వైభవంగా నిర్వహించారు. హుజూరాబాద్ పట్టణంలోని రామాలయంలో, పాటిమీది ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు విద్యానగర్‌లోని శిశుమందిర్‌లో కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రామాలయంలో స్వామివారికి చైర్మన్ క్యాస చక్రధర్-భారతిలు ముత్యాల తలంబ్రాలు, గందె నాగరాజు-వాణిలు పట్టువస్త్రాలు సమర్పించారు. సీతారాముల కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్ఛరణాల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం శంకర్‌లాల్-అగర్వాల్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

**హుజూరాబాద్ రూరల్**: మండలంలోని అన్ని గ్రామాల్లోని ఆలయాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

**జమ్మికుంట/జమ్మికుంట రూరల్:** జమ్మికుంట పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకు వచ్చారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలి వచ్చారు. భక్తులు చేసిన రామ నామస్మరణతో ఆలయం మారు మోగిపోయింది. ఆబాది జమ్మికుంటలోని శ్రీచెన్నకేశవ స్వామి ఆలయంలో వేద పండితులు డింగరి ప్రవీణచార్యులు, మణిశర్మ, విజయశర్మ, నరేందర్‌శర్మ కల్యాణం నిర్వహించారు. గణేశ్‌నగర్‌లోని హనుమాన్ ఆలయం వద్ద శ్రీరామనవమి సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి ఆధ్వర్యంలో 500మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు.

**శంకరపట్నం:** మండలంలోని కేశవపట్నం, కన్నాపూర్, ముత్తారం, రాజాపూర్, లింగాపూర్, ఇప్పలపల్లి గ్రామాలతో పాటు పలు గ్రామాల్లోని రామాలయాలు, హనుమాన్ ఆలయాల్లో సీతారాముల కల్యాణం భక్తజన సందోహం నడుమ వేదపండితుల మంత్రోచ్ఛరణలతో వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

**సైదాపూర్:** మండల కేంద్రంతో పాటు జాగీర్‌పల్లి, ఎక్లాస్‌పూర్, ఎలబోతారం, వెన్నంపల్లి, రాంచంద్రాపూర్, బొమ్మకల్ గ్రామాలలో శ్రీ సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు సీతమ్మవారికి ఒడి బి య్యం పోశారు. కల్యాణం అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆయా కార్యక్ర మాల్లో వెన్కేపల్లి సింగిల్‌విండో అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి, ఎలబోతారం గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు బాపు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

**వీణవంక:** మండలంలోని ఆలయాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. .భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో పరిపాటి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.న

**మానకొండూర్:** శ్రీరామనవమి సందర్భంగా మండల మానకొండూర్, అన్నారం, ముంజంపల్లి, గంగిపల్లి, కొండపల్కుల, లలితాపూర్, రంగపేట, వెల్డి, కెల్లేడు, పచ్చునూర్, చెంజర్ల, లింగాపూర్ గ్రామాలలోని ఆలయాల్లో సీతారాముల కల్యాణం వేదపండితుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. మానకొండూర్‌లో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్ పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

**చొప్పదండి:** మండలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. చొప్పదండి లోని రామాలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా జరుగగా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

**గంగాధర:** మండలంలోని ఆలయాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. కురిక్యాల, ఉప్పరమల్యాల, మల్లాపూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ దీవెన దంపతులు పాల్గొన్ని మొక్కులు చెల్లించుకున్నారు. చర్లపల్లి(ఆర్)లో జడ్పీటీసీ పుల్కం అనురాధనర్సయ్య దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు.

**రామడుగు:** రామడుగు, గోపాల్‌రావుపేట్, తిరుమలాపూర్, వెదిర, వెలిచాల, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. వెదిరలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొని మొక్కులు చెల్లించారు.

**గన్నేరువరం:** మండల వ్యాప్తంగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. మండల కేంద్రంలోని మార్కండేయశ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాలలో నిర్వహించిన వేడుకలకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయకమిటీ నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, ముస్కు ఉపేందర్‌రెడ్డి, కొమ్మెర రవిందర్‌రెడ్డి, చిట్కూరి అనంతరెడ్డి, బొడ్డు సునీల్, చింతల శ్రీధర్‌రెడ్డి, మాతంగి అనిల్, బుర్ర తిరుపతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**తిమ్మాపూర్:** మండల వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. మన్నెం పల్లిలో గ్రామస్థుల ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయంలో సీతారాముల కల్యా ణం వైభవంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో గల శ్రీ పంచ ముఖ అంజనేయ స్వామి, శ్రీరామ సాయి దేవాలయంలో శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహించారు. సాయంత్రం సీతారాముల ఉత్సవ విగ్రహాలతో కాలనీలో ప్రధాన వీధుల మీదుగా శోభాయాత్ర నిర్వహించారు.

**కరీంనగర్ రూరల్:** తీగలగుట్టపల్లిలో శ్రీకోదండరాముని కల్యాణం వైభవంగా జరిగింది శ్రీకోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ కోదండ రామస్వామి కల్యాణాన్ని ఆలయ ప్రధాన అర్చకులు కూర్మాచలం శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ పట్టు వస్త్రాలు సమర్పించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి సతీసమేతంగా కల్యాణ మహోత్సవాన్ని వీక్షించారు. ఆలయ కమటీ చైర్మన్ పాకాల రాంరెడ్డి, కమిటీ డైరెక్టర్‌లు, సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. కొత్తపల్లి పట్టణంలోని సచ్చిదానంద ఆశ్రమంలో శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు తిరువారంగం రామాచార్యులు, రాఘవాచార్యులు, శ్యాంకుమారాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. కరీంనగర్ జిల్లా జడ్జి బి ప్రతిమ కల్యాణ మహోత్సవానికి హాజరయ్యారు. ఆలయ కమిటీ నిర్వాహకులు నరహరి నారాయణరెడ్డి, బండ గోపాల్‌రెడ్డి, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్ కల్చరల్:** నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం వేదపండితులు చంద్రమౌళి స్వామి ఆధ్వర్యంలో కళ్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో నలువాల రాజేందర్ పటేల్, కునాడి రాంరెడ్డి, ముప్పిడి భాస్కర్ రెడ్డి, కార్పొరేటర్ పద్మప్రకాశ్, వసంతరావు, మహేష్, గర్రెపల్లి సత్యనారాయణరావు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. ప్రకాశంగంజ్ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో వ్యాపారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ప్రశాంతనగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్ కుటుంబసభ్యులు, ఈవో నాగారపు శ్రీనివాస్ పాల్గొన్నారు. అశోక్‌నగర్ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అధ్యక్ష కార్యదర్శులు చిట్టుమల్ల శ్రీనివాస్, కాచం రాజేశ్వర్, బొల్లం శ్రీనివాస్, రాచమల్ల భద్రయ్య పాల్గొన్నారు. భారత్ థియేటర్ రోడ్ వీరాంజనేయస్వామి ఆలయంలో చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి పాల్గొన్నారు.లేబర్‌అడ్డా భక్తాంజనేయస్వామి ఆలయంలో మల్లికార్జున రాజేందర్-రజని, శ్రీపురం సురేశ్-రజిత, రవీందర్-రజని దంపతులు కల్యాణం నిర్వహించగా కార్పొరేటర్ పెద్దపల్లి జితేందర్, ఈవో నాగుల అనిల్ కుమార్ పాల్గొన్నారు. రామచంద్రాపూర్ కాలనీ రామభక్తాంజనేయస్వామి ఆలయంలో కార్పొరేటర్ చొప్పరి జయశ్రీవేణు పాల్గొన్నారు. భగత్‌నగర్ అంజనాద్రిపై మేయర్ సునీల్‌రావు-అపర్ణ దంపతులు పాల్గొన్నారు. రాంపూర్ గిద్దెపెరుమాళ్ల ఆలయంలో పురాణం మహేశ్వరశర్మ, రామక శంకరశర్మ పాల్గొన్నారు. ఆదర్శనగర్ రాజరాజేశ్వర, అభయాంజనేయ స్వామి ఆలయంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ పాల్గొన్నారు. జెట్, వికాసతరంగిణి ఆధ్వర్యంలో పద్మనాయక కల్యాణ మండపంలో జరుగుతున్న వసంత నవరాత్రుల నవరాత్రి ఉత్సవాల ముగింపులో భాగంగా చిన్న జీయరుస్వామి ప్రవచనం చేశారు. ఎంపీ, బీజేపి జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్‌కుమార్ స్వామీజిని దర్శించుకొని ఆశీస్సులు పొందారు. శివాజీనగర్ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో కార్పొరేటర్ కుర్ర తిరుపతి పాల్గొన్నారు.

**సుభాష్‌నగర్:** శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణంలో వాసవి వాగ్దేవి వనిత క్లబ్, వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో పుస్తె, మట్టెలు సమర్పించారు. స్థానిక సప్తగిరి కాలనీలోగల కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ జంధ్యం మాదవి, వాసవి వాగ్దేవి వనిత క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాడిశెట్టి గోపాల్, స్వరూప పాల్గొన్నారు.



శంకరపట్నం మండలం రాజాపూర్‌లో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కురిక్యాలలో మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



హుజూరాబాద్‌లో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు